భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయం



గోపన్‌పల్లిలో రంగనాథస్వామి





శివసాయిక్షేత్రంలో విఘ్నేశ్వరుడు



గచ్చిబౌలిలో కాశీవిశ్వేశ్వరస్వామి

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేశారు. బుధవారం గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయాన్ని ఉదయాన్నే ప్రత్యేకంగా అలంకారం చేశారు. ఆ తర్వాత రంగనాథస్వామికి ప్రత్యేకంగా తీసుకొచ్చిన పుష్పాలతో అలంకారం చేశారు. ఆతర్వాత ప్రత్యేక పూజలను చేశారు. గచ్చిబౌలిలోని జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని ఆలయం, శివసాయిక్షేత్రం, నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయం, రాయదుర్గంలోని వెంకటేశ్వరస్వామి, లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం, టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయం, మధురానగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, అదేవిధంగా గౌలిదొడ్డిలోని శివాలయం, వినాయక్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అంతకుముందు ఆలయాలను పూలు, మామిడిఆకులు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు.ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

- రాయదుర్గం

మారనున్న చందానగర్ రూపురేఖలు

- మియాపూర్ నుంచి పటాన్ చెరువు వరకు మెట్రో రైల్ పొడగింపు
- గంగారం వద్ద డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్

హఫీజ్‌పేట్: చందానగర్, లింగంపల్లి, బీహెచ్ఈఎల్ వాసులు ఏన్నో ఎళ్లగా ఎదరు చూస్తున్న మెట్రో రైలు నిర్మాణం కోసం మరి కొద్ది కాలంలోనే ప్రణాళికలు, పనులు ప్రారంభం కానున్నాయి. రెండో విడతలో మియాపూర్ నుంచి పటాన్ చెరువు వరకు మెట్రో రైల్ నిర్మాణం కొరకు మెట్రో రైలు నిర్మాణ సంస్థ, ఎల్అండ్‌టీ ప్రతినిధులు ప్రణాళికలు సిద్ధం చేశారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా మెట్రో రైల్ పొడగింపుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుటింది. దీంతో లింగంపల్లి నుంచి దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్‌కు వెళ్లే దూర ప్రయాణికులు, ఉద్యోగులకు ప్రయాణ సమయంతో పాటు ట్రాఫిక్ సమస్యల వలయాల నుంచి ఉపశమనం కలగనుంది.



గంగారం వద్ద నిర్మించనున్న డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నమూన చిత్రం

- ఇప్పటికే మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకు ప్రజలకు అందుబాటులో ఉన్న మెట్రో రైలు ఇప్పుడు అది కాస్త పటాన్‌చెరువు నుంచి ప్రారంభం కానుంది. నగరంలో ఇప్పిటికే నడుస్తున్న మెట్రో రైలులలో నిత్యం ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. బీహెచ్ఈఎల్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ వాసులు మియాపూర్ వరకు వెళ్లి మెట్రో రైలులో ప్రయాణించాలంటే సుమారు 5 కిలోమీటర్లు ద్విచక్ర వాహనాలపై వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది.
- అతి త్వరలోనే రెండో దశ మెట్రో రైలు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మరి కొద్ది కాలంలోనే వారి గమ్య స్థానాల నుంచే మెట్రో రైలు ఎక్కవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రెండోదశ మెట్రో రైల్ విస్తరణతో మియాపూర్ నుంచి పటాన్ చెరువు వరకు వస్తుండడంతో ప్రజల్లో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రానున్న కొద్ది కాలంలోనే మెట్రో రైల్ పరుగులు తీస్తుందని చందానగర్ ఏరియా రూపురేకలు మారిపోతాయని ప్రజలు మురిసిపోతున్నారు.
- బీహెచ్ఈఎల్, చందానగర్, లింగంపల్లి ప్రాంత వాసులు దూర ప్రాంతాలకు వెళ్లాలంటే మెట్రో రైలు ఎంతో ఉపయోగకరం
- ఎంజీబీఎస్, జేబీఎస్ బస్‌స్టాండ్‌లకు, సికింద్రబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్లకు మెట్రో రైల్‌తో ఎంతో సులభతరంగా ఉంటుంది.
- ట్రాఫిక్ జామ్‌లలో ఇబ్బందులు పడుకుండా చాలా సులువుగా గమ్యాలకు చేర్చుకోవచ్చు.
- ముంబాయి జాతీయ రహదారిపై రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు మెట్రో రైల్ రాకతో చెక్ పెట్టవచ్చు.
- గంగారం వద్ద ప్రధాన రహదారిపై ఉన్న దేవాలయాలు, మతపరమైన కట్టడం కూడా ఉన్నాయి. దీంతో సుమారు 1.2 కిలోమీటర్లు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు.
- ఇప్పటికే చందానగర్ వద్ద జాతీయ రహదారి సంస్థ 1.5 కిలోమీటర్ల ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు.
- ఒక డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్, మరొక ఫ్లైఓవర్‌తో ట్రాఫిక్ జామ్‌లు కాకుండా చందానగర్ ప్రధాన రహదారి రూపురేకలు మారనున్నాయి.
- చందానగర్‌లోని బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండప స్థలాన్ని మెట్రో రైల్ అప్పగించారు.
- మియాపూర్ నుంచి లింగంపల్లి వరకు మెట్రో రైల్ నిర్మాణం పూర్తి అయితే జాతీయ రహదారి రోడ్డు కూడా విశాలంగా మారి ట్రాఫిక్ సమస్య తీరుతుంది.
- లింగంపల్లి నుంచి ఐటీ కారిడార్(కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి)కు కూడా మెట్రో రైల్‌ను విస్తరిస్తే ట్రాఫిక్ సమస్యకు ఉపశమనం లభిస్తుందని స్థానికులు కోరుతున్నారు.



చందానగర్ మెట్రో రైలు నిర్మాణం చేపట్టే జాతీయ రహదారి ఇదే....



చందానగర్ నుంచి లింగంపల్లి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మిస్తున్న దృశ్యం



గంగారం జాతీయ రహదారిపై ఉన్న దేవాలయాలు...ఇక్కడే డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ వచ్చే ప్రదేశం



పొడగింపు కోసం విన్నవించా..



మెట్రో రైలు మియాపూర్ నుంచి లింగంపల్లి వరకు పొడగించాలని గతంలోనే మెట్రో రైల్ ఎండీకి వినతి పత్రం అందజేశా. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణంతో పాటు జాతీయ రహదారి రోడ్డు విస్తరణ చేపట్టాలి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు విస్తరణ చేయాలి.

- రామస్వామి యాదవ్, మాజీ కౌన్సిలర్

మెట్రో ఎంతో ఉపయోగకరం



చందానగర్, బీహెచ్ఈఎల్ ప్రాంత వాసులు ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్‌లకు, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్లకు బస్‌లలో వెళ్లాలంటే గంటన్నర సమయం పడుతుంది. కానీ మెట్రో రైల్‌లో మాత్రం అరగంటలో చేరుకోవచ్చు. దూర ప్ర యాణం చేసే వారికి మెట్రో రైలు ఎంతో ఉపయోగకరం. అంతేకాకుండా మెట్రో రైలు నిర్మాణం తరువాత రోడ్లు కూడా విస్తారంగా మారుతాయి.

- నరాల మహేశ్వర్‌రెడ్డి, చందానగర్

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 80, పచ్చిమిర్చి 70, బెండ 40, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 40, చామ 50, కీర 30, బీర 35, వంకాయ 30, గోకర 55, బీన్స్ 90, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 40, క్యారెట్ 70, చిక్కుడు 80, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 190, వెల్లుల్లి 280లుగా ఉన్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో గురువారం అంతరాయం ఏర్పడనుందని గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కొమరం భీమ్ పరిధిలోని టీఎన్‌జీవోస్ ఫేజ్-1, ఫేజ్-2 ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 12గంటల వరకు..

జర్నలిస్ట్‌కాలనీ ఫీడర్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీ, గౌలిదొడ్డి, పద్మశ్రీ గార్డెన్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

లింగంపల్లి రైల్వేస్టేషన్ రైళ్ల వివరాలు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వేస్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు బయలుదేరు రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

- 4.40 అమరావతి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - విజయవాడ
- 6.15 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - వైజాగ్
- 12.25 దేవగిరి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - సీఎస్ఎంటీ (ముంబాయి)
- 18.25 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - తిరుపతి
- 18.30 కోకనాడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - కాకినాడ (సోమ, బుధ, శుక్ర), (19.00 మంగళ, గురు, శని)
- 20.30 గౌతమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - కాకినాడ
- 21.05 నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - నర్సాపూర్
- 21.40 హంసఫర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి - ఇండోర్ (ఆదివారం)

సినీనటి సిమ్రాన్ చౌదరి సందడి

మెడికవర్ ఆస్పత్రిలో ఫేస్ క్లినిక్ ప్రారంభం



మాదాపూర్: జుట్టు రాలే సమస్యకు అనేక కారణాలు ఉన్నాయని, జుట్టుకు వేసుకునే రకరకాల రంగుల్లో ఉండే కెమికల్స్ ప్రభావం జుట్టుపై పడడం వల్ల జుట్టు రాలుతుందని డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో జుట్టు, ముఖ చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి హెయిర్, ఫేస్ క్లినిక్‌ను సినీనటి సిమ్రాన్ చౌదరితో కలసి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శరత్‌రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ హరికృష్ణ, చీఫ్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్ మహేశ్ దెగ్లూర్కర్, డాక్టర్ సత్యనాగ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి బీకే శివాని ఉపన్యాసాలు

రాయదుర్గం: గచ్చిబౌలి శాంతి సరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో బ్రహ్మకుమారీస్ సంస్థ గ్లోబల్ స్పీకర్ బీకే శివాని ఈనెల 27, 28వ తేదీలలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాలు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. 27వ తేదీన ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు 'ఇన్నర్ కామ్ అండ్ క్లారిటీ త్రూ మెడిటేషన్'అనే అంశంపై, 11 నుంచి ఒంటిగంట వరకు 'ప్రాబ్లమ్స్ టు పాసిబిలిటీస్.. పేయిన్ టు పవర్'అనే అంశంపై, సాయంత్రం 6 గంటలకు రాత్రి 8గంటలకు 'ది పవర్ ఆఫ్ పాజ్'పై ఉపన్యాసం ఉంటుందన్నారు. 28వ తేదీన సాయంత్రం 6నుంచి రాత్రి 8 గంటలకు 'అవేకనింగ్ టు ది కాల్ ఆఫ్ టైమ్'అనే అంశంపై ఆమె ప్రత్యేక ఉపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 15 ఏళ్లు పైబడిన వారికే అవకాశం కల్పిస్తారు. 15 నిమిషాల ముందే కార్యక్రమానికి హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 040-23001234లో సంప్రదించాలని వారు కోరారు.

కంకర క్రషర్లను తరలించాలి

జిన్నారం(పటాన్‌చెరు): కంకర క్రషర్‌లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే తరలించాలని దాదిగూడెం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామం సమీపంలోని కంకర క్రషర్లలో బుధవారం స్థానికులు పర్యటించారు. ఈ సందర్భంగా కంకర క్రషర్ల నిర్వాహకులతో మాట్లాడి ఇబ్బందులను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలుష్యంతో పాటు అక్రమ బ్లాస్టింగ్‌లతో ఇళ్ల బీటలు వారుతున్నాయన్నారు. తక్షణమే కంకర క్రషర్‌లను తొలగించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పండగ సాయన్న త్యాగాలు మరువలేనివి

పటాన్‌చెరు: నిజాం రజాకార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల కడుపు నింపిన పోరాటయోధుడు పండగ సాయన్న అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహావిష్కరణకు ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి ముదిరాజుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పండుగ సాయన్న స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకుంటున్న హస్త కళా ప్రదర్శన

కూకట్‌పల్లి: హెచ్ఎంటి హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన స్వదేశీ హస్త శిల్ప కళాఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఎగ్జిబిషన్‌లో బెంగాల్ కాటన్ చీరలు, జార్జెట్, వెంకటగిరి, నారాయణపేట, వర్కు చీరలు, గాగ్రాచోలీ, టాప్స్, ఖాదీ కుర్తీలు, స్కర్టులు, ప్లాజో ప్యాంటు, రాతి ఆభరణాలు,బ్యాంగిల్స్, జైపూర్ బెడ్ షీట్లు, సోఫా కవర్లు, టేబుల్ కవర్లు, కిడ్స్ కిచెన్‌లు, డోర్ మేట్‌లు అందుబాటులో ఉన్నాయి. హస్తకళలపై 10 శాతం, చేనేత వస్త్రాలపై 20 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 21 వరకు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, పరిసర ప్రాంత వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన కమిటీ నియామకం

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ జయ దుర్గ మైసమ్మ తల్లి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులకు బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ నియామకపత్రాలను అందజేశారు. చైర్మన్‌గా కూన సత్యం గౌడ్, సభ్యులుగా గుంజరి సత్యనారాయణ ముదిరాజ్, ఎం. కృష్ణారెడ్డి, కె. గోపాల కృష్ణ, మాలెంపాటి సురేష్, ఎస్. శ్రీనివాస రెడ్డి, సదా మహేష్, జి. లహరి, బొడ్డ వెంకట మహాలక్ష్మీ ఎన్నికయ్యారు.

ప్రధాన రోడ్డులో చిమ్మచీకట్లు.!



రాయదుర్గంలోని ప్రధాన రహదారిలో రాత్రిపూట పరిస్థితి

రాయదుర్గం: అది పాత ముంబాయి రహదారి నుంచి రాయదుర్గం లోపలికి వెళ్లే ప్రధాన రహదారి. కానీ మూడు రోజులుగా చిమ్మచీకట్లు అలుముకున్నాయి. ముఖ్యంగా వీధి దీపాలు వెలగకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. జీహెచ్ఎంసీలో వీధిదీపాల ఫిర్యాదును ఆన్‌లైన్‌లో చేయాల్సిన పరిస్థితి రావడంతో ఎవరూ చేయలేకపోతున్నారు. ఒకవేళ చేసినా వెంటనే స్పందించలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాల వంటి అత్యవసరమైన వాటిని ఫిర్యాదు ఫోన్ ద్వారా అధికారుల దృష్టికి తెచ్చినా వీధిదీపాలు మరమ్మతులు చేసే పరిస్థితిని తిరిగి పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆషాఢమాసం, వర్షాకాలం కావడంతో ప్రధాన రోడ్డులో ఇలాంటి పరిస్థితి నెలకొనడం పట్ల పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే వీధి దీపాలు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం



ఏసురత్నం (ఫైల్)

మియాపూర్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న కట్టిమపూడి ఏసురత్నం (55) ఈనెల 14న 8.30గంటలకు ఇంటి నుంచి బయటకి వెళ్లి మళ్లీ ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆందోళన చెంది కుమారుడు చిన్న చక్రయ్య మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ...



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన 53 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.17.68 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేదలు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరగంట దంచికొట్టింది.!



లింగంపల్లిలో కురుస్తున్న వర్షం



శేరిలింగంపల్లి: లింగంపల్లిలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. అరగంట పాటు భారీ వర్షం కురవడంతో అంతర్గత, ప్రధాన రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయింది. కానీ లింగంపల్లిలోని అండర్ బ్రిడ్జి వద్ద అంతగా నీటి నిల్వ ఉండకపోవడంతో వాహనాల రాకపోకలకు ఎలాంటి సమస్య తలెత్తలేదు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

బాలాజీనగర్ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా కర్ర గోపీకృష్ణ



నియామకపత్రాన్ని అందజేస్తున్న శ్రీకర్‌రావు

కూకట్‌పల్లి: భారతీయ జనతా పార్టీ బాలాజీనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా కర్ర గోపి కృష్ణ నియమితులయ్యారు. బుధవారం డివిజన్ అధ్యక్షులు వినోద్ కుమార్ గౌడ్ సమక్షంలో కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కన్వీనర్ శ్రీకర్‌రావు ఆయనను శాలువాతో సత్కరించి నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు సూర్యప్రకాష్, సూర్యారావు, శేఖర్, రాము, జగదీష్, సూరిబాబు, ప్రేమ్‌కుమార్, సన్నీ, మహిళా మోర్చా అధ్యక్షురాలు వీరగంటి జ్యోతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ బుధవారం కలిశారు. శేరిలింగంపల్లి నియోజకర్గంలోని వివిధ అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అంతకుముందు మంత్రిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పరిశీలన



మాదాపూర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని చందానాయక్‌తాండలో జరుగుతున్న డ్రైనేజీ పనులను మున్సిపల్ అధికారులతో కలసి స్థానిక నేత శ్రీనివాస్‌యాదవ్ పరిశీలించారు. నాణ్యత లోపాలు లేకుండా పనులు చేయాలని కోరారు. డ్రైనేజీ సమస్య ప్రధానమైనదని ప్రజలకు అందుబాటులోకి ఎంత తొందగా తెస్తే అంత మంచిదని కోరారు. బస్తీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

భద్రత కోసమే 'మై ఆటో ఈజ్ సేఫ్'



ఆటోడ్రైవర్లకు స్టిక్కర్లను అందజేస్తున్న పోలీసులు

పటాన్‌టౌన్: ఆటోలో ప్రయాణించే వారి భద్రత కోసమే 'మై ఆటో ఈజ్ సేఫ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ అన్నారు. మండల పరిధిలోని భానూర్ బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోలకు బుధవారం 'మై ఆటో ఈజ్ సేఫ్' స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఆటోడ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఆటోకు సంబంధించిన పత్రాలను సమర్పించి స్టిక్కర్లను పొందాలని సూచించారు. ఆటోలో ప్రయాణం చేస్తున్న సమయంలో ఆటోడ్రైవర్లు ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించినా, అసభ్యంగా మాట్లాడినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా సీట్ వెనకాల పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన 'మై ఆటో ఈజ్ సేఫ్' క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సంబంధిత ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకొని సబ్మిట్ చేయాలని సూచించారు. దీంతో కంట్రోల్ రూమ్‌తో పాటు సంబంధిత కంప్లైంట్‌కి సమాచారం రాగానే సిబ్బంది స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి సహాయపడతారని తెలిపారు.

వికలాంగులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న రవికుమార్

పటాన్‌చెరు టౌన్: వికలాంగులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ మస్క్యులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ అన్నారు. మండల పరిధిలోని ఇస్నాపూర్ రామాలయం ఆవరణలో కండర క్షీణిత వ్యాధి బాధితుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా కోసం మేము అనే నినాదంతో కదిలి ప్రత్యేక సదుపాయాలే సాధన లక్ష్యంగా పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వంతో టీఎండీఏ రాష్ట్ర కార్యవర్గం, వివిధ జిల్లాల కో-ఆర్డినేటర్లతో కలిసి పలుమార్లు అధికారులు, మంత్రులను కలిసినా పెన్షన్ పెంపుదల, కేర్ టేకర్ అలవెన్సులు వంటివి సదుపాయాలను సాధించుకోలేకపోయామని వాపోయారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమైన 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం వికలాంగులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కంచిగారి మహేష్, కార్యదర్శి కంజర్ల జ్యోతి, సలహాదారులు కంచిగారి శ్రీనివాస్, సాయిలు బుజ్జి మహేష్ వికలాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన కార్పొరేటర్ బుధవారం కాలనీలో పర్యటించి సమస్యను అడిగి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారులైన ఉషా ముళ్లపూడి రోడ్డు నుంచి జగద్గిరిగుట్ట పైపులైన్ రోడ్డు వైపునకు వెళ్లే వాహనాలు శుభోదయ కాలనీ మీదుగా వెళ్లటంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైందన్నారు. గోవింద్ హోటల్ చౌరస్తా వద్ద సిగ్నల్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నేరుగా పైపులైన్ రోడ్డుకు మళ్లిస్తే సమస్య తగ్గుతుందన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోశెట్టి గౌడ్, అల్లురయ్య, సరవయ్య, శర్మ, రత్నం , డా. సునీల్, సుందరి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.